
సాక్షి బాపట్ల

శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వినుకొండ: పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. హోమం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 588.50 అడుగులకు చేరింది. ఇది 307.5790 టీఎంసీలకు సమానం.



దుర్గమ్మకు కానుకలు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు పోసాని బసవయ్య గురువారం 24.7 గ్రాముల బంగారు ముక్కు పుడక, బొట్టు, నత్తును సమర్పించారు.

న్యూస్‌రీల్

ఘనంగా భూ వరాహ స్వామి జయంతి వేడుకలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై భూ వరాహస్వామి జయంతి వేడుకలు రెండో రోజైన గురువారం వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళా శాసనాలతో భూ వరాహస్వామి జయంతి మహోత్సవాల్లో భాగంగా ఉదయం 10 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించామని తెలిపారు. వివాహ యోగ్యత, దాంపత్యాభివృద్ధి, మంచి సంతానం పొందుటకు ఈ కల్యాణ మహోత్సవం దోహదపడుతుందని తెలిపారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

పీజీ కోర్సుల ఫలితాలు విడుదల

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ జరిగిన పలు పీజీ కోర్సుల 4వ సెమిస్టర్ ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు గురువారం విడుదల చేశారు. సోషల్ వర్క్ 16కి 16మంది, ఎంఏ అప్లయిడ్ లింగ్విస్టిక్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్‌లో 10కి 10మంది, మాస్టర్ ఆఫ్ ఒకేషనల్ ఫుడ్ ప్రాసెసింగ్ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులో 21కి 18 మంది, మాస్టర్ ఆఫ్ ఒకేషనల్ హార్టీకల్చర్ అండ్ ల్యాండ్ స్కేపింగ్‌లో 16 మందికి 11మంది ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను 18లోగా ఒక్కొక్క పేపరుకు రూ.1860, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ.2190 చెల్లించాలని ఆయన సూచించారు.

9,10 తేదీల్లో రాష్ట్ర స్థాయి జూడో పోటీలు



గుంటూరు వెస్ట్(క్రీడలు): గుంటూరు జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల జూడో చాంపియన్‌షిప్ 2025–26 పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షులు అప్పికట్ల శ్రీహరి నాయుడు తెలిపారు. గురువారం స్థానిక జేకేసి కళాశాల రోడ్డులో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ్‌కుమార్, శ్రీహరి నాయుడు, గుంటూరు జిల్లా జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, పల్నాడు జూడో అసోసియేషన్ అధ్యక్షులు పసుపులేటి వెంకటేశ్వరరావులు ఆవిష్కరించారు. శ్రీహరి నాయుడు మాట్లాడుతూ పెద పరిమిలోని మువ్వా చిన్న బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు.

వెలుగులోకి రేషను డీలర్ మోసం

దూరం విషయంలో అబద్ధాలు చెప్పి బియ్యం పాయింట్‌కు అనుమతి

తాడికొండ: గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన 'అధికారమే అండగా డీలర్ల దందా' కథనంతో అధికారులు తర్జనభర్జన పడ్డారు. ఎట్టకేలకు నింద తమపై వేసుకోకుండా హడావుడిగా ఆర్డీవో జారీ చేసిన సిఫార్సు లేఖను వెలుగులోకి తీసుకొచ్చి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేశారు. ఒకే డీలరుకు రెండో పాయింట్ కేటాయించేందుకు చెప్పిన కారణాలు చూసి సాటి డీలర్లే ముక్కున వేలేసుకుంటున్నారు. అర కిలోమీటరు లేని దూరానికి ఒకటిన్నర కిలోమీటరుగా చూపిస్తూ రెండో పాయింట్ ఏర్పాటుకు అనుమతులిచ్చారు. కాలనీకి కేవలం 200 మీటర్లలోపు దూరంలో ఉన్న డీలరును పాడుబడిన భవనంలోకి వెళితేనే సరుకు కేటాయిస్తామంటూ దబాయించి తరిమేయడం మరో అంశం. ఆ పాయింట్ ఏ ఇంటివద్ద నిర్వహించాలి అనే డోర్ నంబర్ లేదా ఇతర అడ్రస్సు ఏమీ పొందుపరచకపోవడం చూస్తుంటే సదరు డీలరుపై ఎంత ప్రేమో అర్థం అవుతోంది. ఎక్కడైనా బియ్యం తీసుకునే ఎనీ వేర్ విధానం అందుబాటులో ఉంది. ప్రజలు తమ ఇష్టం వచ్చిన దగ్గర సరుకులు తెచ్చుకుంటున్నారు. అయినా రెండో పాయింట్ అవసరం ఇప్పుడేమొచ్చింది అంటూ అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పాయింట్ రద్దు చేసి, డీలర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి హెచ్చరిక
- నగరం ఎంపీడీవోకు చార్జ్ మెమో జారీ
- నగరం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్
- జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం



నగరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకుంటున్న కలెక్టర్

నగరం: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే వేటు తప్పదని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. మండల కేంద్రమైన నగరంలోని డంపింగ్ యార్డ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. పరిసరాలలో చెట్లు, మొక్కలు పెరిగిపోయి ఉండటం పట్ల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరం ఎంపీడీవోకు చార్జ్ మెమో ఇచ్చి, నగరం గ్రామ పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం పద్ధతి కాదన్నారు. విధులు సక్రమంగా నిర్వర్తించని వారికి చార్జ్ మెమోలు జారీ చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. గ్రామాలలో చెత్తాచెదారం, మురుగునీటి నిల్వలు లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని పేర్కొన్నారు.

జిల్లాలో 171 జ్వరం కేసులు

జిల్లా పరిధిలో 171 జ్వరం కేసులు ఉన్నట్లు వైద్య సిబ్బంది గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. నిజాంపట్నం మండలంలోని ముత్తుపల్లి గ్రామంలో పర్యటించారు. పంచాయతీ, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈదుపల్లిలో 6, పండిళ్లపల్లి, వేటపాలెంలో ఒక్కో డెంగీ కేసులను గుర్తించినట్లు వెల్లడించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు. నగరం సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రోగులను పరామర్శించి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే జిల్లా వైద్యశాలకు జ్వరం కేసులను రిఫర్ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణ ముఖ్యం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: సీజనల్ వ్యాధులను నియంత్రించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై 11 శాఖల అధికారులతో గురువారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, వేటపాలెం మండలాలలో అప్రమత్తం కావాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను విస్మరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. డెంగీ కేసులు నమోదైన చోట ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ చెప్పారు. చెరుకుపల్లి, నగరం, వేటపాలెం మండలాలలో 8 కేసులు నమోదైనట్లు గుర్తుచేశారు. జిల్లా వ్యాప్తంగా ఫాగింగ్ చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలలో నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, వైద్య ఆరోగ్యశాఖ తదితరులు పాల్గొన్నారు.

బీసీల జోలికి వస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే

- వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు
- పూలే విగ్రహం వద్ద నేతల నిరసన



జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు

బాపట్ల: కూటమి ప్రభుత్వం బీసీల జోలికివస్తే తగ్గిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని వైఎస్సార్ సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షులు గవిని శ్రీనివాసరావు హెచ్చరించారు. పులివెందులలో టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడిని ఖండిస్తూ పార్టీ బీసీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక చీలురోడ్డు సెంటర్‌లోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నిరసన ధర్నా చేపట్టారు. గవిని శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్దేశపూర్వకంగానే బీసీ నాయకుడుపై దాడి చేయించారని అన్నారు. బీసీ ఓట్లతో గెలుపొందిన కూటమి ప్రభుత్వం టార్గెట్ చేసి మరీ బీసీలపై దాడులు చేయటం సరికాదన్నారు. భవిష్యత్‌లో బీసీలపై దాడులు జరిగితే ఓట్ల ద్వారా సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యువజనవిభాగం జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు వాసుమల్ల వాసు, బాపట్ల నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు పీటా వేణుగోపాల్, నాయకులు శాయిలమురళి, జిల్లా మున్సిపాలిటీ అధ్యక్షులు బత్తుల అనీల్, బీసీ నేతలు పిన్ని బోయిన ప్రసాద్ యాదవ్, తన్నీరు వెంకట్రావు, నర్రావుల వెంకట్రావు, పులి శ్రీను, బాపట్ల పట్టణ వైసీపీ యువజన అధ్యక్షులు ఊరబండి గోపీనాథ్, నక్కల పవన్ కుమార్, పాలపర్తి గోపి, జమ్ములపాలెం మాజీ సర్పంచ్ కటికల యోహోషువా తదితరులు ఉన్నారు.

అవినీతిమయంగా ఉపాధి పథకం

- రెండోరోజు 9 పంచాయతీలలో పనులపై కొనసాగిన సామాజిక తనిఖీ
- బోగస్ మస్టర్లపై నిరసన వ్యక్తం చేసిన మాజీ సర్పంచ్



మల్లాయపాలెంలో అవినీతికి పాల్పడ్డారని వివరిస్తున్న మాజీ సర్పంచ్

బల్లికురవ: ఉపాధి హామీ పథకం బల్లికురవలో అపహాస్యం పాలైంది. విచారణ చేపట్టగా అవినీతి బహిర్గతమవుతోంది. స్థానిక పరిషత్ కార్యాలయం వద్ద గురువారం రెండో రోజు బహిరంగ ప్రజావేదిక ఉదయం 10.30 గంటలకు ప్రారంభమై రాత్రి వరకు కొనసాగింది. 21 గ్రామ పంచాయతీల్లో రూ.12 కోట్లకు జరిగిన 645 పనులకు సంబంధించి బుధవారం ఆరు, గురువారం రాత్రికి 9 పంచాయతీల్లో విచారణ పూర్తయింది. అవినీతి మస్టర్‌లు, పనుల్లో కొలతల్లో వ్యత్యాసాలు, మొక్కల పెంపకం రికార్డులకే పరిమితమయింది. ఒకరు పనిచేస్తే మరొకరికి మస్టర్, ఉద్యోగులు, చదువుకునే విద్యార్థులు, వృద్ధులను పనులకు వచ్చినట్టు చూపించారు. ఇలా అక్రమాలకు పాల్పడినట్లు సామాజిక తనిఖీ బృందాలు ప్రజావేదికలో ఆధారాలతో వివరించాయి. మల్లాయపాలెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ అబ్బారెడ్డి బాలకృష్ణ 68 మందికి బోగస్ మస్టర్లు వేసి రూ.లక్షల్లో స్వాహా చేశారని డ్వామా బాపట్ల జిల్లా పీడీ డీ.విజయలక్ష్మికి ఆధారాలతో వివరించారు. పీడీ, జిల్లా విజిలెన్స్ అధికారి చంద్రశేఖర్, ప్రోగ్రాం మేనేజర్ సనీల్, ఎస్‌ఆర్‌పీలు తులసి నాయక్, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

తెనాలిలో విజిలెన్స్ అధికారుల దాడులు

- అనుమతి లేని వరి విత్తనాలు గుర్తింపు
- రూ.5,85,300 విలువైన విత్తనాలు సీజ్ చేసిన అధికారులు

తెనాలిటౌన్: అనుమతిలేని విత్తనాలను తెలంగాణ రాష్ట్రం నుంచి తెచ్చి తెనాలి ప్రాంతంలో అమ్మకాలు జరుపుతున్న ఎరువులు, విత్తనాల షాపులపై గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపుదాడి చేసి రూ.5,85,300 విలువైన వరి విత్తనాలను సీజ్ చేశారు. స్థానిక నందులపేటలోని వినాయక ఎంటర్ ప్రైజెస్ దుకాణంలో జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయాధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అనుమతిలేని వరి విత్తనాలను తెలంగాణ నుంచి తెచ్చి అమ్ముతున్నట్లు గుర్తించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. విజిలెన్స్ అధికారి సీహెచ్.ఆదినారాయణ, ఇన్‌స్పెక్టర్లు కె.చంద్రశేఖర్, పి.శివాజీ, మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు, పలువుసిబ్బంది తదితరులు ఈ దాడుల్లో పాల్గొన్నారు.

అతివల రక్షణే పోలీస్ ధ్యేయం

- మహిళలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం
- జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ



జిల్లా ఎస్పీకి రాఖీకట్టి శుభాకాంక్షలు తెలిపిన విద్యార్థినులు

బాపట్లటౌన్: మహిళల రక్షణే పోలీస్ ధ్యేయమని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం విద్యార్థినులు ఎస్పీకి రాఖీ కట్టి ముందస్తుగా రాఖీపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత విద్యార్థినులతో ఎస్పీ మాట్లాడుతూ పాఠశాలల పరిస్థితి, ఏవైనా సమస్యలున్నాయా? ఎవరైనా ఆకతాయిలు వేధిస్తున్నారా? తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ రాఖీ పండుగ భారతీయ సంస్కృతిలో ప్రత్యేక స్థానం కలిగి ఉందన్నారు. రక్షణగా, అండగా నిలిచే సోదరుడికి రాఖీ కట్టి, క్షేమంగా, సుఖ సంతోషాలతో ఉండాలని సోదరీమణులు కోరుకుంటారన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని పోలీసులకు రాఖీలు కట్టడం కేవలం సాంప్రదాయానికి మాత్రమే కాకుండా, పోలీస్ శాఖపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. మహిళల భద్రత కోసం ఏ సమస్య వచ్చినా పోలీస్ సహాయం క్షణాల్లో పొందేందుకు 'శక్తి యాప్' రూపొందించినట్లు తెలిపారు. అనుకోని ఆపద వచ్చినపుడు, తక్షణ సహాయం అవసరమైనప్పుడు, యాప్‌లోని ఎస్‌ఓఎస్ బటన్ ప్రెస్ చేస్తే నిమిషాల్లో సంబంధిత పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని భద్రత కల్పిస్తారన్నారు. మహిళలకు 24/7 అందుబాటులో ఉండే శక్తి వాట్సాప్ నంబర్ 79934 85111ను ఇటీవల అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. జిల్లాలోని మహిళలకు రక్షణ కల్పిస్తూ, ఈవ్ టీజింగ్‌లను అరికట్టేందుకు, మహిళలకు చట్టాలపై వారి హక్కుల గురించి అవగాహన కల్పించేందుకు జిల్లాలో 5 శక్తి బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి శక్తి బృందానికి ఎస్ఐ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా ఉంటారన్నారు. విద్యార్థులు, మహిళలు మౌనం వీడి నిర్భయంగా ముందుకు వచ్చి తమ సమస్యలు చెప్పినప్పుడే మరింత భద్రత కల్పించగలమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేతల అభ్యున్నతికి కృషి

- మంత్రులు సవిత, డోలా బాలవీరాంజనేయ స్వామి
- చీరాలలో జాతీయ చేనేత దినోత్సవాలు
- స్వయం సహాయక సంఘాలకు రూ.10 కోట్ల రుణాలు మంజూరు




స్వయం సహాయక సంఘాలకు చెక్కును అందిస్తున్న మంత్రి సవిత

చీరాల: రాష్ట్రంలో చేనేతలకు టీడీపీ ఆవిర్భావం నుంచి తమ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం రాత్రి మండలంలోని జాంద్రపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ చేనేత దినోత్సవంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ చేనేతల అభ్యున్నతి కోసం టీడీపీ ఆవిర్భావం నుంచి కృషి చేస్తోందన్నారు. ఆనాడు ఎన్టీఆర్, నేడు సీఎం చంద్రబాబు నాయుడు చేనేతలు గౌరవ ప్రదమైన జీవితం కొనసాగించాలనే లక్ష్యంతో ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతలకు మేలు కలిగేలా నాలుగు పథకాలను సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా ఏడాదికి మగ్గాలపై నేసే నేతన్నలకు రూ.15 వేలు, మరమగ్గాలపై ఆధారపడిన వారికి రూ.32 వేలు ఆదా అవుతుందన్నారు. నేతన్న భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.25 వేలు అందజేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోనున్నారన్నారు. చేనేత వస్త్రాలపై 5 శాతం రీయింబర్స్‌మెంట్ అందజేయనున్నారన్నారు. త్రిఫ్ట్ నిధులు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే 50 ఏళ్లు నిండిన 93 వేలకు పైగా నేతన్నలకు రూ.4వేల పెన్షన్లు అందజేస్తున్నారన్నారు. అనంతరం నియోజకవర్గంలోని 68 స్వయం సహాయ సంఘాలకు రూ.10కోట్లు రుణాల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఎంఎం కొండయ్య, ఉగ్ర నరసింహారెడ్డి, ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్ర వర్మ, కలెక్టర్ జె.వెంకట మురళి, పలువురు ప్రజాప్రతినిధులు, చేనేతలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై అడ్డగోలు పెత్తనం

గుంటూరు అర్బన్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలపై సూపర్‌వైజర్లు, ఇతర అధికారుల అడ్డగోలు పెత్తనం ఎక్కువైంది. తమకు అనుకూలంగా ఉండే వారిని మిగతా కార్యకర్తల వద్దకు విజిట్‌ల పేరుతో పంపి ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ సాకుతో వారి పనులన్నీ తమతో చేయిస్తూ మానసికంగా హింసిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎంతో కొంత సమర్పించుకున్న వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



- తాము చేయాల్సిన పనులూ అప్పగిస్తున్న సూపర్‌వైజర్లు, పై అధికారులు
- అనుకూలంగా ఉండే సిబ్బందికి అనధికార సెలవులు మంజూరు
- విజిట్‌ల పేరుతో మిగతా వారిపై నిత్యం వేధింపులు
- గుంటూరు అర్బన్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు తప్పని కష్టాలు



ఐసీడీఎస్ జిల్లా కార్యాలయం

నెహ్రూనగర్: బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ప్రతి నెల పౌష్టికాహారం పంపిణీ ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేస్ రికగ్నేజేషన్ సిస్టం) ద్వారా జరుగుతుంది. ఫోన్లు సక్రమంగా పనిచేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో సూపర్‌వైజర్లు చేయాల్సిన పనిని కూడా తమకు నచ్చని అంగన్‌వాడీ కార్యకర్తలతో చేయిస్తున్నారు. దీంతో ప్రీ స్కూల్ నిర్వహణ సక్రమంగా లేదు. మరోవైపు అంగన్‌వాడీలు చేయాల్సిన విధుల్లో ఆలస్యమైతే మెమోలు ఇస్తున్నారు. గుంటూరు అర్బన్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పదవీ విరమణ పొందిన స్థానాల్లో అక్కడ పనిచేస్తున్న ఆయాకు అర్హతలను బట్టి కార్యకర్తగా పదోన్నతి కల్పిస్తారు. ఇలా ఎవరైనా పొందితే రూ.1.50 లక్షలు వరకు ఇవ్వాలని అధికారులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. లేదంటే రోజూ విజిట్ల పేరుతో వేధిస్తున్నారు.

అదనపు భారంతో బెంబేలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలలో పది రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. వీటి నిర్వహణ కోసం కార్యకర్తపై రూ.1,500 నుంచి రూ. 2 వేల వరకు అదనపు భారం తప్పడం లేదని బాధితులు వాపోతున్నారు. ఆర్‌టీఐ విజిట్‌ల పేరుతో వచ్చే వారిని మేనేజ్ చేసేందుకు ప్రతి కేంద్రం నుంచి రూ.200 సమర్పించాలని అధికారులు సూచించడంతో ఆ మొత్తం కూడా వీరే ఇస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సరుకులు ఎండీఎం వాహనాల ద్వారా రేషన్ షాపు నుంచి సరఫరా అయ్యేవి. ఇప్పుడు రేషన్ షాపు నుంచి ఆటోలో ప్రత్యేకంగా తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని కార్యకర్తలు వాపోతున్నారు. తమకు ఇచ్చే రూ.11,500 జీతంలో ఇలా ఖర్చులు పోతే మిగిలేదేమీ ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. ప్రసూనను దీనిపై వివరణ కోరగా.. సరుకులను సూపర్‌వైజర్ తీసుకుంటున్న విషయం తన దృష్టికి రాలేదని చెప్పారు. వివరాలు సమగ్రంగా పరిశీలించాక తప్పు ఉన్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

ప్రసన్నం చేసుకుంటే అంతా ఓకే..

సూపర్‌వైజర్లను, ఆపై అధికారులను ప్రసన్నం చేసుకుంటే చాలు కార్యకర్తలకు అనధికార సెలవులు ఇస్తున్నారు. దీంతోపాటు ఆయా కేంద్రాలకు విజిట్‌కు వెళ్లడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఓ అంగన్‌వాడీ కార్యకర్త విదేశాలకు వెళ్లినట్లు సమాచారం. అధికారుల అండదండలు ఉండటంతో మేనేజ్ చేస్తున్నారని తెలిసింది. ఇటీవల అర్బన్ పరిధిలోని ఓ సూపర్‌వైజర్ బయట సరుకులు తేవాలని ఓ అంగన్‌వాడీ కార్యకర్త భర్తను బెదిరించారు. ఆయన ఓ కిరాణా దుకాణంలో పనిచేస్తుండటంతో ఫోన్ చేసి కావాల్సిన వస్తువులను తెప్పించుకున్నట్లు సమాచారం. నెల నెలా ఇలా చేస్తుండటంతో విసిగిపోయిన ఆయన కొద్ది నెలల క్రితం అర్బన్ సీడీపీఓ కార్యాలయం వద్దకు వచ్చి అధికారులకు ఫిర్యాదు చేశారు.

9 నుంచి గుంటూరులో ట్రాఫిక్ మళ్లింపులు

శంకర్‌విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి కూల్చివేత దృష్ట్యా నిర్ణయం



జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: గుంటూరు నగరంలోని శంకర్‌విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి కూల్చివేత పనుల దృష్ట్యా ఈ నెల 9 వ తేదీ నుంచి ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగర పరిధిలో రాకపోకలు సాగించేందుకు ముందస్తు ప్రయాణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అన్నారు. ప్రజల సౌకర్యార్థం పలు తాత్కాలిక మార్గాలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. అందరూ నిబంధనలను పాటించి సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

వివిధ మార్గాల్లో మళ్లింపులు ఇలా..

- అమరావతి రోడ్ నుంచి మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా (ఎంటీబీ) సెంటర్ వైపు వెళ్లే భారీ వాహనాలను చిల్లీస్ పాయింట్ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్ మార్గంలో మళ్లిస్తారు.
- లాడ్జి సెంటర్ నుంచి ఎంటీబీ సెంటర్ వైపు వెళ్లే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఇకనుంచి అరండల్‌పేట, పొట్టిశ్రీరాములునగర్, డొంకరోడ్డు, మూడు వంతెనలు లేదా బ్రాడీపేట, కంకరగుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి మార్గాల్లో వెళ్లాల్సి ఉంటుంది. తిరుగు ప్రయాణంలో కూడా ఈ మార్గం మీదుగా వెళ్లాలి.
- ఎంటీబీ సెంటర్ నుంచి లాడ్జి సెంటర్ వైపు వెళ్లే భారీ వాహనాలు (పాఠశాల, కళాశాల బస్‌లు సహా) రమేష్ హాస్పిటల్ నుంచి కంకరగుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదగా ప్రయాణించాలి.
- కోబాల్డ్‌పేట, కృష్ణనగర్, చంద్రమౌళినగర్, బృందావన్‌గార్డెన్స్, లక్ష్మీపురం ప్రాంతాల నుంచి మార్కెట్ వైపు వచ్చే వాహనాలన్నీ పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ రోడ్ లేదా బ్రాడీపేట, కంకరగుంట రైల్వే అండర్ బ్రిడ్జి, కలెక్టర్ కార్యాలయం రోడ్డు, నగరంపాలెం మీదగా వెళ్లాల్సి ఉంటుంది.
- పట్టాభిపురం నుంచి గుంటూరు ప్రభుత్వాసుపత్రి (జీజీహెచ్) వైపు వెళ్లే వారు కంకరగుంట రైల్వే ఓవర్‌బ్రిడ్జి, ఎంటీబీ సెంటర్, ప్రభుత్వ మహిళా కళాశాల (ఉమెన్స్ కాలేజ్) వైపు నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు మీదగా వెళ్లాలి.
- లాడ్జి సెంటర్ నుంచి ఎంటీబీ సెంటర్ వైపు వెళ్లే భారీ వాహనాలు చిల్లీస్, ఇన్నర్‌రింగ్ రోడ్, ఆటోనగర్, బస్టాండ్ లేదా కంకరగుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి మార్గాలను ఉపయోగించాలని తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1,400 గరిష్టం : రూ. 2,200

మోడల్ ధర రూ. 1,800

మిర్చి

యార్డు సమాచారం (గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	52,137
అమ్మకాలు	59,986
నిల్వ	5,178

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,400
నంబరు-5	10,000-13,200
273	10,500-12,800
341	10,000-14,200

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,300
341	10,000-14,700
4848	10,000-12,500
సూపర్ -10	10,000- 13,200

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,000
బాడిగ-355	10,000 - 12,800
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,800 - 11,000
తాలుకాయలు	5,000 - 7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,800
బాడిగ - 355	10,000-12,500
దేవనూరు డీలక్స్	10,000 - 12,300
తాలు	5,300 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)



పసుపు ధరలు

(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 549

కొమ్ములు : 381 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,200	10,950	10,500

కాయలు : 170 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,090	10,950	10,325

మొత్తం అమ్మకాలు : 411.750 క్వింటాళ్లు

కారంచేడు ఘటనపై దగ్గుబాటి వ్యాఖ్యలు అర్థరహితం



కారంచేడు మృతవీరుల రుధిరక్షేత్రం వద్ద మాట్లాడుతున్న కారంచేడు బాధిత పోరాట గ్రామస్తులు

చీరాల రూరల్: కారంచేడులో అగ్రవర్ణాలు జరిపిన మారణకాండపై మాజీ ఎంపీ దగ్గుబాటి వెంకటేశ్వరరావు ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా తమ తండ్రి ప్రమేయం లేదని వక్రీకరించి మాట్లాడటం తగదని, కారంచేడు బాధిత పోరాట గ్రామవాసులు పేర్కొన్నారు. ఉద్యమనేత కత్తి పద్మారావుపై చేసిన వ్యాఖ్యలను కూడా కారంచేడు మృతవీరుల సాక్షిగా తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. విజయనగర్ కాలనీలోని కారంచేడు మృతవీరుల రుధిరక్షేత్రం వద్ద గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కారంచేడు పోరాట ఉద్యమ సీనియర్ నాయకుడు దుడ్డు భాస్కరరావు, సిద్రా భగత్‌సింగ్, తేళ్ల సుబ్బారావు, గొర్రెపాటి రవికుమార్, బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య మాట్లాడారు. 40 ఏళ్ల క్రితం భారతదేశ చరిత్రలోనే భయానక ఘటనగా ఆనాడు కారంచేడు దారుణ మారణకాండ జరిగితే దానిని సమాజంలో గౌరవమైన స్థానంలో ఉన్న మాజీ ఎంపీ, ఎమ్మెల్యే అయిన దగ్గుబాటి వెంకటేశ్వరరావు వక్రీకరించి మాట్లాడడం తగదన్నారు. ఆనాడు వెంకటేశ్వరరావు తండ్రి చెంచురామయ్య ప్రోద్బలంతోనే ఆయన సామాజిక వర్గీయులు.. మాదిగలను మారణాయుధాలతో వెంటాడి వేటాడి హతమార్చినట్లు అప్పట్లోనే వార్తా పత్రికలైన ఉదయం, టైమ్స్ ఆఫ్ ఇండియా, బీబీసీ వంటి ఛానల్స్ నిర్ధారణ చేసుకున్నాయన్నారు. ఆ తర్వాతే ఆయన తండ్రి పేరును ప్రసారం చేయడం జరిగిందన్నారు. పోలీసులు కూడా ఎఫ్ఐఆర్‌లో ఆయన పేరును పొందు పరచిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ఈ ఘటన అనంతరం ఆయన తండ్రిని కొంతమంది హతమార్చిన విషయం నిజంకాదా అని ప్రశ్నించారు. కారంచేడు ఘటనలో ఆయన తండ్రి ప్రమేయం ఉన్నట్లు అన్ని ఆధారాలు ఉన్నప్పటికి ఘటన జరిగిన ఇన్నేళ్లకు తన తండ్రి ప్రమేయం లేదని వెంకటేశ్వరరావు సోషల్ మీడియా వేదికగా చెప్పడం చూస్తుంటే భవిష్యత్తులో ఆయన తండ్రి.. దళితజాతి ద్రోహి అనే ముద్రను చెరిపేసుకునేందుకు ఆరాటపడుతున్నారని అర్థమవుతోందని తెలిపారు. కారంచేడు ఘటనలో కీలకంగా పనిచేసి బాధితుల పక్షాన నిలబడి పోరాడిన అప్పటి దళిత ఉద్యమనేత కత్తి పద్మారావు.. దగ్గుబాటి తండ్రి పేరును పదేపదే ప్రస్తావించడం కూడా మంచి పద్ధతి కాదని ఆయన పేర్కొంటున్నాడని.. ఇది మంచిపద్ధతి కాదని వారు హితవు పలికారు. ఇప్పటికైనా వెంకటేశ్వరరావు నిజానిజాలు తెలుసుకుని మాట్లాడాలని లేకుంటే యావత్ సమాజం, ప్రజా సంఘాల సహకారంతో కారంచేడు బాధిత పోరాట గ్రామవాసులు భవిష్యత్ కార్యాచరణ తీసుకుని ముందుకు సాగేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో దుడ్డు ఏసుపాదం, తేళ్ల ప్రసాద్, దుడ్డు వందనం, తేళ్ల బోయేజు, గొర్రెపాటి వందనం, డేగల నాగరాజు, తేళ్ల రాంబాబు, తేళ్ల ఏసు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న చేతి వృత్తులు

- సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య
- భట్టిప్రోలులో చేనేత కార్మికుల నిరసన దీక్ష



మాట్లాడుతున్న సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య

భట్టిప్రోలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల చేతి వృత్తులు కనుమరుగవుతున్నాయని సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. 11వ జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని గురువారం భట్టిప్రోలు రథం సెంటర్‌లో ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికులు నిరసన దీక్ష నిర్వహించారు. చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సభలో గంగయ్య మాట్లాడుతూ చేనేత పరిశ్రమ కనుమరుగు కానున్నదని అన్నారు. పరిశ్రమలో ఉన్న కార్మికుల సంక్షేమానికి కృషి చేయమని ప్రజలు ఎంత మొత్తుకున్నా పాలకులు వినిపించుకునే స్థితిలో లేరని విమర్శించారు. ప్రభుత్వాల విధానాల వల్ల గ్రామాలలో కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా అధికార పార్టీలు ప్రజాసంక్షేమాన్ని విస్మరించారని అన్నారు. చేనేత పరిశ్రమ రక్షణ కోసం జరిగే పోరాటాల్లో కార్మికులు కలసి రావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జీఎస్టీని వెంటనే రద్దు చేసి చేనేత పరిశ్రమను ఆదుకోవాలని కోరారు. భారత జాతీయ వారసత్వ సంపదైన చేనేత పరిశ్రమ, కార్మికుల రక్షణ కోసం చేనేత కార్మికులు ఐక్యంగా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, చేనేత కార్మిక సంఘం(ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి జి.బాలాజి, చేనేత నాయకులు బి.నాగమల్లేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, దీపాల సత్యనారాయణ, ఎం.శ్రీలక్ష్మి, బి.రాజకుమారి, జిల్లా రైతు సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు జి.సుధాకర్, పి.మనోజ్, జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు

రౌండ్ టేబుల్ సమావేశంలో సీఐటీయూ నాయకులు



రౌండ్‌టేబుల్ సమావేశంలో చర్చిస్తున్న సీఐటీయూ జిల్లా నాయకులు

బల్లికురవ: గ్రానైట్ క్వారీల్లో భద్రతా చర్యలు పాటించక పోవటం వల్లే తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని నిర్లక్ష్యం వీడి భద్రతతపై చర్యలు చేపట్టాలని సీఐటీయూ బాపట్ల జిల్లా నాయకులు సీహెచ్ మజుంధర్, తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈర్లకొండ సత్యకృష్ణ క్వారీలో జరిగిన ప్రమాదంపై గురువారం బల్లికురవలో నిబంధనల భద్రతా చర్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పరాయి రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికుల పట్ల చిన్న చూపు చూస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. చాకిరీకి తగ్గ వేతనాలు చెల్లించటం లేదని.. క్వారీల వద్ద మకాం ఉంటున్న కార్మికులకు సరైన వసతులు కూడా చూపించటంలేదన్నారు. ప్రమాదం సంభవించిన సమయంలో మృతులు, క్షతగాత్రులను తక్కువ సంఖ్యలో చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు రక్షణగా ఉండాల్సిన మైనింగ్ అధికారులు మామూళ్ల మత్తులో క్వారీలను పర్యవేక్షించనందున ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నాయన్నారు. సంతమాగులూరు, బల్లికురవ మండలాల్లోని క్వారీలో గత దశాబ్ద కాలంలో 70 మంది పైగా కార్మికులు చనిపోయారని.. అయితే అధికారికంగా ప్రకటించకుండా, కేసులు లేకుండా సెటిల్‌మెంట్‌లతో పబ్బం గడుపుతున్నారన్నారు. సత్యకృష్ణ క్వారీకి అధికారుల అండదండలు ఉండటంతో మృతుల సంఖ్య తగ్గించారని, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు కోటి రుపాయలు, క్షతగాత్రులకు రూ.50 లక్షల చొప్పున పరిహారం చెల్లిచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిహరరెడ్డి, ఎంఆర్‌పీఎస్ నాయకుడు పేతురు, ఆంజనేయులు, వీరయ్య, వీరనారాయణ, కత్తి నాగయ్య పాల్గొన్నారు.

నూరుశాతం అక్షరాస్యతే లక్ష్యం

నరసరావుపేట రూరల్: రాష్ట్రంలో నూరుశాతం అక్షరాస్యత సాధించే లక్ష్యంతో ఉల్లాస్-అక్షర ఆంధ్ర వయోజన అక్షరాస్యత కార్యక్రమాన్ని చేపట్టినట్టు వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు కె.ఆంజనేయులు తెలిపారు. ఉల్లాస్ వయోజన అక్షరాస్యత కార్యక్రమం రెండవ దశ ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంపై మండల స్థాయి కమిటి సభ్యులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో గురువారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆంజనేయులు ప్రారంభించి మాట్లాడారు. అక్షరాస్యతలో మన రాష్ట్రం దేశంలోని ఇతర చిన్న రాష్ట్రాల కన్నా వెనుకబడి ఉందన్నారు. 2029 నాటికి నూరు శాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో ఇతర ప్రభుత్వ శాఖల సహకారంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. డీఆర్‌డీఏ, మెప్మాలలోని స్వయం సహాయక బృందాల మహిళలు, ఉపాధి హామీ కూలీలలో చదువురాని వారిని గుర్తించి వారికి చదువు చెప్పేందుకు పదమందికి ఒక వలంటీర్‌ను నియమిస్తున్నట్టు తెలిపారు. వలంటీర్లకు మండల స్థాయి కమిటీలు వారి మండలాల్లో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం టీచర్లు వారికి కేటాయించిన అభ్యాసకులకు క్రియాత్మక, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతను అందించవలసి ఉంటుందని వివరించారు. బాపట్ల జిల్లా నోడల్ ఆఫీసర్ జి.మల్లికార్జున్, డ్వామా పీడీ సిద్ద లింగమూర్తి, రీసోర్స్ పర్సన్స్ కె.మనోరంజన్‌బాబు, రవి గోవర్ధన్, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఏపీఎంలు, ఏపీఓలు, మెప్మా సీఎంఎంలు పాల్గొన్నారు.

నీరజ్ చోప్రాను ఆదర్శంగా తీసుకోవాలి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఒలింపిక్స్‌లో బంగారు పతకం గెలుచుకున్న నీరజ్ చోప్రాను అథ్లెట్స్ ఆదర్శంగా తీసుకోవాలని అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా చైర్మన్, సీనియర్ అథ్లెట్ జి.శేషయ్య తెలిపారు. గురువారం స్థానిక బీఆర్ స్టేడియంలో జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి అండర్-14, 16, 18, 20 బాల బాలికలతోపాటు యువతీ యువకల జావెలిన్ త్రో పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. శేషయ్య మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించనందుకుగాను భారత ప్రభుత్వం ప్రతి ఏడాది ఆగస్టు 7న జాతీయ జావెలిన్ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. అతి సామాన్య కుటుంబంలో పుట్టిన నీరజ్ చోప్రా విజయ రహస్యాలను అథ్లెట్స్ సాధన చేయాలన్నారు. అనంతరం శేషయ్య, జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కోచ్ రవి, కె.రాజు, సుబ్రమణ్యం, చిన్న, నాని పాల్గొన్నారు.

అద్దె చెల్లించలేదని మహిళపై దాడి

తాడేపల్లిరూరల్: స్థానిక ఇప్పటంలో అద్దె చెల్లించే విషయంలో ఆలస్యం కావడంతో జనసేన నాయకుడి తమ్ముడు ఓ మహిళపై దాడి చేసిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ఖాజావలి కథనం ప్రకారం.. కుంచనపల్లిలో నివాసముండే అమ్మిశెట్టి సురేష్ అనే యువకుడు తనకున్న నివాసాన్ని హాస్టల్ నిర్వహించుకునేందుకు అదే గ్రామానికి చెందిన శ్రీలత అనే మహిళకు అద్దెకు ఇచ్చాడు. నెలకు రూ. 50 వేలు అద్దె చెల్లించాల్సి ఉండగా శ్రీలత రూ. 30 వేలు ఇచ్చిందని, రూ. 20 వేలు చెల్లించే విషయంలో సురేష్‌కు, శ్రీలతకు రెండు మూడుసార్లు చిన్నపాటి వాదనలు జరిగాయి. బుధవారం రాత్రి శ్రీలత ఇప్పటంలో ఉన్నానని, రూ. 20 వేలు ఇస్తానని చెప్పింది. ఇదే విషయమై సురేష్ మరో ఇద్దరితో కలసి ఇప్పటం వెళ్లి వాదనకు దిగాడు. అక్కడ ఇద్దరి మధ్య ఘర్షణ జరగడంతో శ్రీలతపై సురేష్‌తో పాటు మరో ఇద్దరు దాడి చేశారు. ఈ విషయమై శ్రీలత పోలీసులకు స్వయంగా ఫిర్యాదు చేయడంతో దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. ఇదిలా ఉంటే అమ్మిశెట్టి సురేష్ అన్నయ్య జనసేన నాయకుడు కావడంతో శ్రీలతను కేసు విత్‌డ్రా చేసుకోమని ఒత్తిడి తీసుకువస్తున్నారు. తమపై ఎటువంటి ఒత్తిడి తెచ్చినా మంత్రి లోకేష్‌ను కలసి ఫిర్యాదు చేస్తామని వారి బంధువులు వెల్లడించారు.

ప్రజాప్రతినిధులనే రక్షించలేని కూటమి

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడిని ఖండించిన యాదవ సంఘం నాయకులు

మార్టూరు: ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గుండాల దాడి దుర్మార్గమని ప్రజా ప్రతినిధులకే రక్షణ కల్పించలేని ఈ ప్రభుత్వం సామాన్యులకు ఏమి కల్పిస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మార్టూరు పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆడకా గంగయ్య యాదవ్ ప్రశ్నించారు. స్థానిక యాదవ సంఘ నాయకులతో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్.. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొనగా ఆయనపై దాడి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఓటమి భయంతో ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేయడం, ప్రలోభాలను ఎరచూపి బలవంతంగా పార్టీ మార్పులకు పాల్పడటం సిగ్గుచేటని గంగయ్య యాదవ్ ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వస్తే బీసీల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని బీ రాలు పలికిన కూటమి నేతల మాటలు ఏమయ్యాయని, రమేష్ యాదవ్పై దాడి జరిగితే ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో స్థానిక యాదవ సంఘ నాయకుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు అంగిరేకుల ఏడుకొండలు, మర్రి పెద్దన్న, యలగాల డాన్ శ్రీను, యలగాల వెంకటేశ్వర్లు, ఆరుమళ్ళ పోతురాజు, వేల్పుల లింగారావు, మర్రి శేషగిరి, కొండపల్లి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నా బిడ్డను అన్యాయంగా తీసుకెళ్లారయ్యా

పోలీసుల తీరుపై ఘొల్లుమన్న తండ్రి



వివరాలు వెల్లడిస్తున్న విద్యార్థి తండ్రిమల్లి

పట్నంబజారు: అర్ధరాత్రి .. రెండు గంటల సమయం.. పోలీసులు ఇంటి గోడలు దూకి దబదబా తలుపులు కొట్టారు.. దూకుడుగా ఇంట్లోకి ప్రవేశించి బీటెక్ చదువుతున్న విద్యార్థిని కాలర్ పట్టుకుని లాక్కుని బయటకు వెళ్లారు.... ఆపైన చోరీ చేసినట్లుగా ఇళ్లంతా వెతికారు.. ఇదంతా బయటి వ్యక్తులు చేసిన పని కాదు.. సాక్షాత్తు పోలీసులు వ్యవహరించిన తీరిది. దీనిపై విద్యార్థి తండ్రి దేవరకొండ మల్లి వివరాలు 'సాక్షి'కి వివరించారు. ఓబులనాయుడుపాలెంలో నివాసం ఉండే దేవరకొండ మల్లి తహసీల్దారు కార్యాలయంలో పనిచేస్తున్నాడు. అతని కుమారుడు రాజమనోహర్ బీటెక్ చదువుతున్నాడు. బుధవారం రాత్రి 2 గంటల సమయంలో ఈస్ట్ సబ్ డివిజన్ పోలీసులమంటూ రెండు జీవుల్లో వచ్చిన పోలీసులు బలవంతంగా విద్యార్థి రాజ మనోహర్‌ను లాక్కొని వెళ్లారు. కుటుంబ సభ్యులు అడ్డుకున్నప్పటికీ వారిని పక్కకు నెట్టి విద్యార్థిని తీసుకెళ్లారు. లాలాపేట పోలీసు స్టేషన్ అని చెప్పి తీసుకెళ్లినట్లు తెలిసింది. విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు లాలాపేట పోలీసు స్టేషన్‌కు వెళ్లగా, తాము ఎవరిని తీసుకురాలేదని తెలిపారు. కొత్తపేట పోలీసు తీసుకెళ్లినట్లు ధృవీకరించారు. పలుమార్లు పోలీసులు కొత్తపేట, లాలాపేట అంటూ సదరు విద్యార్థి తల్లిదండ్రులను తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు తిప్పినట్లు బాధితులు వాపోయారు. తన కుమారుడిని ఏ కేసులో తీసుకెళ్లారు, ఎందుకు తీసుకెళ్లారనే అంశంపై ఎలాంటి వివరణ తమకు చెప్పలేదన్నారు. తమ కుమారుడు హ్యాకింగ్ చేశాడని చెబుతున్నారని, తన కుమారుడు అలాంటి వాడు కాదని చెప్పారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో ఒక ప్రజాప్రతినిధి గురించి పెద్ద ఎత్తున హల్‌చల్ అయిన విషయం విదితమే. ఈక్రమంలో ఆ కేసులో విద్యార్థి పోస్టింగ్ పెట్టాడనే నెపంతో తీసుకెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. సదరు విద్యార్థి పోస్టింగ్ పెట్టాడా లేదా అనేది తెలియాల్సి ఉంది. దీనిపై కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్య చౌదరిని వివరణ కోరగా, కేసు విచారణలో ఉందని, మీడియాకు వివరాలు వెల్లడించలేమని తెలిపారు.

కోర్టు తీర్పుపై ఉపాధ్యాయ నేతల హర్షం

తాడేపల్లిరూరల్ : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో 2019లో ఉపాధ్యాయులపై అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులపై నమోదైన కేసు తీర్పు గురువారం ఉపాధ్యాయులకు అనుకూలంగా రావడంతో హర్షం వ్యక్తం చేశారు. జనవరి 31, 2019 సంవత్సరంలో ఏపీ సీపీ ఎస్ఇఏ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ పిలుపు ఇచ్చారు. అప్పట్లో తాడేపల్లి పోలీసులు 17 మంది ఉపాధ్యాయులపై కేసు నమోదు చేశారు. ఆ కేసులో కర్నూలుకు చెందిన ఏడుగురు, విజయనగరానికి చెందిన ఆరుగురు, అనంతపురానికి చెందిన ముగ్గురుపై కేసు నమోదైంది. మంగళగిరి న్యాయస్థానం ఉపాధ్యాయులపై అప్పటి ప్రభుత్వం మోపిన కేసు కొట్టివేయడంతోఅధ్యక్ష కార్యదర్శులు బాజీ పఠాన్, కరీమ్ రాజేశ్వరరావు కోర్టు తీర్పుపట్ల హర్షం వ్యక్తం చేస్తూ న్యాయం గెలిచిందని అన్నారు. తమ న్యాయమైన కోర్కెల కోసం శాంతియుతంగా ఛలో అసెంబ్లీ కార్యక్రమం చేపడితే తాడేపల్లి పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేశారు. అప్పటి నుండి 17 మంది కోర్టు చుట్టూ తిరుగుతున్నారన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో సీబీ వెంకట రమణారెడ్డి (కర్నూలు), ప్రేమనాథ రెడ్డి (అనంతపురం), జె. రమేష్ (కర్నూలు) కులాయప్ప (అనంతపురం), అజయ్ (విజయనగరం) తవిడి నాయుడు (విజయనగరం), సత్యనారాయణ (గుంటూరు) ఉన్నారు.

అవయవదానంతో ఐదుగురికి నూతన జీవితం



కృష్ణదుర్గ సునతను సన్మానిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ

గుంటూరుమెడికల్: తాను మరణిస్తూ అవయవదానంతో మరో ఐదుగురికి నూతన జీవితాన్ని ప్రసాదించాడు. ఇంటి పెద్ద చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు పెద్ద మనస్సు చేసుకుని అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చారు. అవయవదానం చేసిన కుటుంబ సభ్యులను ఆసుపత్రి యాజమాన్యం ఘనంగా సత్కరించారు. వివరాల్లోకి వెళితే... బాపట్ల జిల్లా, భట్టిప్రోలు మండలం అద్దేపల్లి గ్రామానికి చెందిన కనగాల బాల రామకృష్ణ (59) ఐదేళ్లగా గుంటూరు కృష్ణనగర్‌లో నివసిస్తున్నారు. ఆగస్టు 3న గుంటూరు గుజ్జనగుండ్ల నుంచి పట్టాభిపురం వైపు సైకిల్‌పై వెళుతున్నాడు. కారు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌కు తరలించారు. అత్యవసర చికిత్స పొందుతూ ఈనెల 7న బ్రెయిన్‌డెడ్ గా నిర్ధారించి, చికిత్స అందిస్తున్న న్యూరాలజీ చీఫ్ డాక్టర్ కుమారవేల్ విషయాన్ని కుటుంబసభ్యులకు విషయం తెలిపారు. బాలరామకృష్ణ కుటుంబ సభ్యులకు ఆసుపత్రి వారు జీవన్‌ధాన్ గురించి తెలియజేయడంతో, అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వైద్యులు గురువారం ఆపరేషన్ చేసి బాలరామకృష్ణ శరీర అవయవాలను ఇతరులకు అమర్చి నూతన జీవితాలను ప్రసాదించారు. గుంటూరు రమేష్ హాస్పటల్‌లో లివర్, కిడ్నీ సమస్యలతో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురు రోగులకు బాలరామకృష్ణ శరీర అవయవాలను ఆపరేషన్ ద్వారా అమర్చి ఇరువురికి నూతన జీవితాన్ని ప్రసాదించారు. మరో కిడ్నీ, రెండు నేత్రాలను విజయవాడ విజయ్ హాస్పటల్, తాడిగడప ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించి, అక్కడ చికిత్స పొందుతున్న వారికి అమర్చి నూతన జీవితాన్ని ప్రసాదించారు.

సూపరింటెండెంట్ అభినందన

జీవన్‌దాన్ ట్రస్ట్ తరుపున గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ గురువారం బాలరామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించి అభినందించారు. త్వరలో ప్రభుత్వం అవయవదానం చేసిన వారిని గుర్తించి తగినవిధంగా సహకరిస్తుందని వెల్లడించారు. జీవన్‌ధాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 10 వేలు కుటుంసభ్యులకు అందించారు. ఆస్టర్ రమేష్ హాస్పటల్ డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత మాట్లాడుతూ విషాద సమయంలో కూడా ఆ కుటుంబం తీసుకున్న అవయవదాన నిర్ణయం అభినందనీయం అన్నారు.

అంతర్జాతీయ సదస్సులో గుర్తింపు అభినందనీయం



శ్రీకృష్ణకు పురస్కారం అందిస్తున్న వీసీ


పెదకాకాని(ఏఎన్‌యూ) : అంతర్జాతీయ సదస్సులో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ హిందీ విభాగ సహాయ సమన్వయకర్త డాక్టర్ కె శ్రీకృష్ణ పురస్కారం పొందడం అభినందనీయమని యూనివర్సిటీ వీసీ ఆచార్య కె గంగాధరరావు అన్నారు. పంజాబీ సభ మాస్కో(రష్యా), నేపాల్ సంస్కృత విద్యాలయ వాల్మీకీ విద్యాపీఠం(నేపాల్ రాజధాని ఖాట్మండ్) సంయుక్తంగా ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో డాక్టర్ కె శ్రీకృష్ణకు విద్యాశ్రీ సమ్మాన్ 2025 పురస్కారం లభించింది. గురువారం వీసీ ఆచార్య కె గంగాధరరావు తన ఛాంబర్‌లో డాక్టర్ శ్రీకృష్ణను అభినందించారు. శ్రీకృష్ణను రెక్టార్ ఆచార్య కె రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కళాశాలల్లో రెడ్ రిబ్బన్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ మురళీకృష్ణ

నరసరావుపేట ఈస్ట్: జిల్లా పరిధిలో అన్ని యాజమాన్యాలలోని జూనియర్ కళాశాలల్లో రెడ్ రిబ్బన్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ తెలిపారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖలో భాగమైన ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవి, ఎయిడ్స్ (దిశ) ఆధ్వర్యంలో గురువారం హార్డ్ జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ నిర్వహించారు. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ కళాశాలల్లో రెడ్ రిబ్బన్ క్లబ్‌లు ఏర్పాటు చేయటం ద్వారా విద్యార్థులలో ఎయిడ్స్ అవగాహన పెరిగి నియంత్రణకు అవకాశం కలుగుతుందని తెలిపారు. జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి మాట్లాడుతూ కళాశాలల్లో రెడ్ రిబ్బన్ క్లబ్‌లు ఏర్పాటుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని తెలిపారు. ఈమేరకు అన్ని ఇంటర్ కళాశాలల్లో క్లబ్‌ల ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో జిల్లా క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జానీబాషా, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ప్రాజెక్ట్ మేనేజర్ ఉదయరాజు, సిఎస్సీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మహమ్మద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోర్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఓగిరాల



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ఫ్లోర్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఓగిరాల వెంకట రాహుల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కే-రిడ్జి పాఠశాలలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీలలో భాగంగా అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్టు వెంకటరాహుల్ తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే గుర్తింపు పొందుతున్న ఫ్లోర్ బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అసోసియేషన్‌ను మండల స్థాయి నుంచి ఏర్పాటుచేసి ఫ్లోర్ బాల్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. అసోసియేషన్ అభివృద్ధికి నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తానని తన వంతుగా రూ.1.10 లక్షలు అందిస్తానని తెలిపారు.

రణక్షేత్రంలో వీరాచారుల సందడి

కారెంపూడి: పల్నాటి వీరాచారులు పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో గురువారం తమ పూర్వీకులైన పల్నాటి వీరులకు పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఆధ్వర్యంలో ప్రత్యేక క్రతువులు నిర్వహించారు. గుంటూరులోని గుజ్జనగుండ్లకు చెందిన సింగంశెట్టి వెంకటేష్ కుంటుంబీకులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ఆచారవంతులు బస్సుల్లో తరలివచ్చారు. పల్నాటి వీరుల గుడి ఆవరణ నుంచి బ్రహ్మనాయుడు ఆయుధం నృసింహకుంతంతో పాటు పల్నాటి వీరుల ఆయుధాలకు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. చెన్నకేశవస్వామి, అంకాలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఇదిలా ఉంటే ఏదో ఒక ప్రాంతం నుంచి పల్నాటి వీరాచారవంతులు రణక్షేత్రానికి వస్తున్నారు.